

మాస్టర్ పీచు...

"మన సుబ్రావ్‌గాడు ఈ కళాఖండం ద్వారా మన మట్టి బుర్రల్లోకి ఎక్కించదలచిన మహత్తర సందేశం ఏమిటంటావు?" రావు నుద్దేశించి అడిగాడు దాసు.

రావు బుర్ర గోక్కోలేదు, కళ్ళజోడు సవరించలేదు, ఎదురుగా ఉన్న పెయింటింగును గానీ, పైకప్పునుగానీ పరిశీలించటం లాంటి వేవీ చేయలేదు. అతని చూపులు అల్లంతదూరాన్న ఓ శిల్పం ముందున్న ఇద్దరమ్మాయిల మీదనున్నాయి. ఆ చూపులు నిశితంగా వారి సౌంద ర్యాన్ని ఎక్స్‌రే తీస్తున్నట్లున్నాయి.

ఆర్ట్ గ్యాలరీలో డజన్లకొద్దీ ట్యూబ్‌లైట్లు వెలిగిపోతున్నాయ్! వాటి క్రింద ఓ నలభైదాకా రంగురంగుల పెయింటింగులు మెరిసిపోతున్నాయ్!

ఆ నలభైలోనూ రెండు సుబ్బారావువి. అతను ఎంతో కొంత పేరున్న చిత్రకారుడే! ఆ రెండింట్లోనూ ఒకదానికి పదివేల రూపాయల 'అవార్డ్' వచ్చింది. ఆ పెయింటింగ్ గురించే అడిగాడు దాసు. ఎగ్జిబిషన్లో ఆ అవార్డ్ రావటం అంటే "ఈ దేశంలోని ఈ సంవత్సరపు ఆర్టులోకెల్లా అత్యుత్తమ కళా ఖండం ఇది!" అని చాటిచెప్పటమే.

ఓ మంత్రిగారు వచ్చి "తృతీయ పంచవర్ష ప్రణాళిక - కళాభివృద్ధి - అది ఎటుల జరుగ గలదు" అనే అంశంపై అనర్గళంగా ఉపన్యసించి స్వహస్తాలతో సుబ్బారావుకు పదివేల రూపాయల చెక్కు అందించి, బరువైన దండొకటి వేసి, శాలువాకప్పి షేక్ హ్యాండిచ్చి ఇంకా రెండు గంటలన్నా కాలేదు.

ఆ చిత్రాన్నుద్దేశించే అడిగాడు దాసు.

కానీ, రావు పలుకలేదు. కనీసం ఇటు చూడనన్నా లేదు.

"మన వాడికి ఎదురుగా ఉన్న ఈ పెయింటింగులకన్నా దూరంగా ఉన్న ఆ ఆడపిల్లలే కళాత్మకంగా కనిపిస్తున్నట్లున్నారు!" అన్నాడు మూర్తి.

"మంత్రిగారు తెగ పొగిడిన పదివేల రూపాయల కళాఖండం కళ్ళెదుట ఉండగా రావు గాడు ఇలా ఆ అమ్మాయిలెవర్నో చూస్తూ గుటకలు మింగుతూండటం కళారంగానికే ఇన్సల్ట్!" అన్నాడు రాజు.

రావు ఉడుక్కోలేదు. "ఎదురుగా సజీవ శిల్పాలు కదలాడుతుండగా చూసి సంతోషించ

లేని మీ కళాభిమానం తగలెయ్య. ఏముందోయ్. ఈ సుబ్రావ్‌గాడి పెయింటింగులో? ” అన్నాడు నిర్లక్ష్యంగా!

“అక్షర లక్షలు ‘చేసే మాట సెలవిస్తివిరా రావూ? నువ్వో ఎగ్జిబిషన్ పెట్టి అందులో ఇలాంటి అమ్మాయిల్ని కళాత్మకంగా వేలాడదీయరాదురా! చూసి తరిద్దుము గదా!” అన్నాడు దాసు.

“నా సంగతికేంగానీ, పోనీ నువ్వు చెప్పరాదురా మూర్తీ, ఈ కళాఖండం లోతుపాతులు! రోజూ సాయంత్రం సుబ్రావ్‌గాడితో కలిసి ఒన్ బై టూ చాయ్ త్రాగి పేవ్‌మెంటు మీద ఆర్టును గురించి చర్చిస్తుంటావు గదా!” అన్నాడు రావు.

సుబ్బారావు ఈ నలుగురికీ కూడా పరిచయస్తుడే! మూర్తికి మాత్రం మంచి మిత్రుడు!

“ఏమైనా సుబ్రావ్‌లో ఈ మధ్య కొంత ప్రొగ్రెస్ కనిపిస్తోందిలే!” అన్నాడు మూర్తి!

“అవునవును! ఈమధ్య వాడి గడ్డం, మీసాల్లో చాలా అభివృద్ధి ఉంది సుమా! ఆ మధ్య దూరాన్నుంచి చూసి పోల్చుకోలేకనే పోయాను!” అన్నాడు దాసు.

“వాడి వేషంలాగే వాడి కళాఖండాలూ గుర్తుపట్టటం ఈమధ్య మరీ కష్టమయిపోతోంది గానీ, ఇంతకీ ఈ మాస్టర్ పీస్ మనకిచ్చే మహత్తర సందేశం ఏమిటంటారూ? ” ప్రశ్నించేడు రావు.

ఎదురుగా సుబ్బారావు పెయింటింగ్ ట్యూబ్‌లైట్ల పాల వెలుగులో కాంతులు విరజిమ్ముతోన్నట్లున్నది. ఆ నలుగుర్లోనూ మూర్తి ఒక్కడే కాస్త ఆర్టును గురించి ధాటీగా మాట్లాడగలవాడు.

“ఏముంటుంది! మీరూ ఇలాగే రంగులు రుద్ది కాన్వాసులు ఖరాబుచేసి, అవార్డులూ, పదేసివేల రూపాయలూ సంపాదించండి! అని కావచ్చు!” అన్నాడు రాజు.

“పదివేలు కాదు, ఇరవై వేలు అను! ఇందాకే మ్యూజియం వాళ్ళు వచ్చి కొనేందుకు సెలక్టుచేసిన వాటిలో ఈ పెయింటింగ్ కూడా ఉంది. దీని ధర పదివేల రూపాయలు!” అన్నాడు దాసు.

“వారేవా! ఈ రాత్రికి సుబ్రావ్‌గాడిచేత స్కాచ్ బుడ్డీ ఖాళీచేయించకుండా వదలగూడదు!” అన్నాడు మూర్తి.

“నాన్సెన్స్ మా స్కూల్ పిల్లకాయలు కళ్ళుమూసుకొని రుద్దగలరు, ఈ మాత్రం కళాఖండాలు!” అన్నాడు ఒళ్లు మండుతున్న రావు.

“తగ్గరా, నాయనా! పిల్లగాళ్ళు కళ్ళు మూసుకుని వెయ్యగల కళాఖండాల్ని ఆర్టు కాలేజీల్లో అయిదారేళ్ళు తలక్రిందులుగా తపస్సు చేసి ప్యాసైన కళాకారులు వేయగలగటం అంత తేలికేం కాదు!” అన్నాడు, మూర్తి.

“అవును పికాసో ఆ మాటే చెప్పాడు” సమర్థించేడు రావు.

“అసలు ఏ ఆర్టిస్టయినా చిత్రాలు ఎందుకు వేస్తాడంటారూ? ” ప్రశ్నించాడు దాసు.

“తిన్నది అరక్క! కడపునొప్పి తీర్చుకోడానికి” అన్నాడు రావు.

“ఛ... ఛ కళాకారుని ఆత్మసంతృప్తికే!” అన్నాడు రాజు.

“ఈ ఎగ్జిబిషన్లతో, అవార్డుల్తో మన ఆర్టిస్టుల ఆత్మలు శాంతించి ప్రశాంతంగా నిద్రపోతున్నాయంటారా? ”

“ఏమైనా గానీ, అసలు ఆత్మశాంతికని గీసేవాడూ, రాసేవాడూ అదేదో వాడి ఆత్మలోనే ఏడవక ఇలా ఇంత డబ్బు తగలేసి రంగులూ, కాన్వాసులూ, ఫ్రేములూ పాడుచెయ్యటం

ఎందుకూ? "

"ఆ తర్వాత ఎగ్జిబిషన్లకు పంపి ప్రైజుల కోసం పైరవీలు చెయ్యటం, జడ్జీలకు తైర్లు కొడుతూ తిరగటం... రాకపోతే ఏడవటం... ఎందుకూ...? " రెట్టించేడు రావు.

"మరి ఎగ్జిబిషన్లో కాకుంటే మీరంతా చూసేదెలాగోయ్? " ప్రశ్నించేడు మూర్తి.

"చూసి? ..."

"తరించటం... లేకుంటే ఆస్ట్రో కంపెనీ వాడి లాభాలు పెంచటం!"

మరీ అంత తేలిగ్గా నోరుజారేయకండోయ్! కళల్ని ఆస్వాదించాలంటే కొంతన్నా అనుభవం కావాలి! కళాదృష్టి అలవరచుకోవాలి!" అన్నాడు మూర్తి.

"అవును సుమా! రోజూ మా బామ్మ తెల్లారే చన్నీళ్ల స్నానంచేసి, చాలాసేపు ఏదో గొణుగుతూ కూర్చుంటుంది. ఎంతవిన్నా నాకది అర్థంగాక మా అమ్మనడిగితే 'ఆవిడ శివస్తోత్రం చదువుతోందిరా' అంది. నిజమే, అనుభవం ఉంటేగానీ ఏదీ అర్థం అయిచావదు. ఆ దేవుడికి కూడా ఈ అనుభవం ఉన్నట్టులేదు. మా బామ్మకు ఇంతవరకూ ప్రత్యక్షం కానేలేదు!" అన్నాడు రావు.

"అయితే ఈ ప్రైజులిచ్చేవాళ్ళూ, వాటిని ఇప్పించే జడ్జీలూ, వాటిని పంచిపెట్టిన మంత్రులూ వీళ్ళంతా వెర్రిబాగులవాళ్లేనంటావేమిట్రా? "

"అబ్బెబ్బే! ఏదో ఓ చిన్న ఎన్జీవోగాడిని! అంత పచ్చి నిజాలు నేనెలా ప్రవచించగలను!"

"అంత తేలిగ్గా కొట్టెయ్యకండోయ్! ఈసారి వచ్చిన జడ్జీలు సామాన్యులేం గాదు! తలనెరిసిన, పండ్లూడిన ఆర్ట్ క్రిటిక్కులు, కలకత్తా, ఢిల్లీ, బాంబేల్నుంచి తలా ఒకరు వచ్చారు!"

"రైల్లో కూడా కాదు! విమానాల్లో!" అందించాడు రాజు.

"అయితే మహా మేధావులన్న మాటే!"

"అక్షరాలా! ఈమధ్య చాలా విమానాలు దార్లోనే చతికిలపడుతున్నది ఈ విజ్ఞానాన్ని మొయ్యలేకనే!"

"మన రావుగాడికి ఈ ఆర్టంటే గిట్టదనీ తెలిసి కూడా వాడితో పోట్లాటెందుకురా!" వారించాడు దాసు.

"మీ కున్నంత కళాహృదయం నాకు లేదుగానీ, నన్ను వదిలేసి మీరంతా ఈ కళాఖండాల్ని మేసి సంస్కృతిని ఉద్ధరించండిరా నాయనలారా! అని తప్పుకున్నాడు రావు.

మూర్తి కాలర్ సర్దుకుని కళ్లజోడు సవరించుకున్నాడు. "మనకు అర్థంకానంత మాత్రాన ఈ ఆర్టునంతా చెత్తక్రింద జమకట్టడం సరిగాదు" అంటూ ప్రారంభించాడు.

"కాస్త చదువుకున్న అజ్ఞానులం! పైగా పదేళ్లుగా సుబ్రావ్‌గాడి దోస్తులం! మనకే అర్థంగాకుంటే మరింకెవరి కోసంరా బాబూ ఈ బొమ్మలు? " అడ్డు వచ్చాడు దాసు.

"ఏం ఎందుకు అర్థంగావు? సుబ్రావ్ ఈ పెయింటింగ్స్‌లో కొన్ని సింబల్స్ వాడాడు. అవేమిటో ముందు తెలుసుకుంటే సరి!" అన్నాడు మూర్తి!

ఎవరూ మాట్లాడలేదు. ఉత్సాహంతో విజృంభించాడు మూర్తి.

"మీరింకా గుర్తించటం లేదు గానీ, సుబ్రావ్‌గాడు ఈమధ్య చాలా ఎదిగాడు! మొన్న ఆదివారం సత్యజిత్‌రాయ్ సిన్మాకు కూడా వెళ్ళివచ్చాడు!"

"అలాగా! మొన్న మా బామ్మ చేతుల్లో సినిమా పాటల పుస్తకం చూసాను!" అందిం

చాడు రావు.

"నువ్వుండరా నాయనా!" విసుక్కున్నాడు మూర్తి! "ఈమధ్య సుబ్రావ్ చాలా చదివేడు. వాంగో జీవితం చదివీ, అతని చిత్రాలు ఆల్బంలో చూసీ మనవాడో వారంరోజులపాటీ లోకంలోనే లేడు!"

"కొంపదీసి వాంగోలాగే చెవి కోసుకుని కట్లుకట్టుకుని పడుకోలేదుగదా? మనెవరం గమనించలేదే!"

నాన్సెన్స్ మాట్లాడకు! ఆ మాటకొస్తే చెవిగానీ, ముక్కుగానీ కోసుకోగల దమ్ములు- ఒక్క కళాకారులకే ఉంటాయి!" గద్దించేడు దాసు.

"సరే! మరి సుబ్రావ్‌గాడు చెవి కోసుకోకుండా ఏం చేసినట్లు? " ఉత్సాహం చూపించేడు రావు.

"వేస్తే వీళ్ళందర్నీ మించిపోవాలి. కళారంగాన్ని జయించాలి! అని తేల్చుకున్నాట్ట!"వివరించేడు మూర్తి.

శభాష్! మరి ఇవన్నీవేసి మన దుంపలెందుకు తెంపుతున్నట్టు? "

"ఎందుకా! వాడెంతగా ఎదిగాడో నీకెలా తెలియటం? వాడి ఆలోచనలే మారిపోయాయి. విప్లవ భావాలు ఎక్కువయ్యేయి!"

ఎదురుగా ఉన్న సుబ్రావ్ పెయింటింగ్ అకస్మాత్తుగా ఓ బాంబుగా మారి పేలినంతగా ఉలిక్కిపడ్డారు ఆ ముగ్గురూ. నమ్మలేనట్లుగా మూర్తి వంక సంభ్రమంగా చూసేరు.

మూర్తి మందహాసం చేశాడు. "ఈ పెయింటింగ్‌లో రంగుల ముద్దలు తప్ప మరేం లేవనేగదా మీ గోల! నిజమే. కానీ, అంతా ఆ రంగుల్లోనే ఉంది. కాస్త పరికించి చూడండి. పైభాగంలో ముద్దముద్దగా చిక్కగా ఉన్న ఆ ఎర్రరంగు ప్రగతికి, విప్లవ భావాలకు సంకేతం. ఎరుపంటే ఏమిటో తెలుసుగా...? "

"అ...అ... అవును!" నసిగేడు దాసు.

మధ్యలో పసుపురంగులో కలగాపులగంగా, పెద్ద పెంటకుప్పలా కనుపిస్తున్నదే...అదే మన చుట్టూ ఉన్న ఈ సమాజానికి సింబల్"

"న్ని...న్ని...న్నిజమే న్లాగుంది? ..."

"కాకేం! సుబ్రావ్‌గాడేమన్నా నీబోటి ఎన్జీవో గాడనుకున్నావా! వాడీమధ్య చాలా సీరియస్‌గా, తెగింపుగా ఆలోచిస్తున్నాడులే!"

"ఊఁ, తర్వాత...? "

"ఇహ ఈ చిత్రం క్రిందిభాగంలో ఉబ్బెత్తుగా ఉన్న నల్లరంగు బలిసిన పందికి సింబల్!"

"పందా? ... అంటే...? "

"పంది దేనికి సింబల్ అయిందీ కూడా తెలీదూ? " గద్దించేడు మూర్తి.

"పంది పరిశుభ్రతకు చిహ్నం. అవే లేకుంటే మా ఏలూరు, వెంకాయగూడెం ఈమాత్రం శుభ్రంగానన్నా ఉండేవిగావు!" అందించాడు రాజు.

"నీ జోకులకేంగానీ, విను!" ఉపక్రమించేడు మూర్తి. "స్వార్థం కోసం సమాజాన్ని ఛండాలంగా రూపొందనిచ్చి అందుమూలంగా లాభపడాలని చూసే దుష్టవర్గాలకు సింబల్ ఈ పంది!"

"అవునవును!" అడ్డం వచ్చాడు దాసు!

"మా ఆఫీసులో ఓ లావాటి ఆఫీసరుగాడున్నాడు. ఎవరికీ దక్కకుండా మామూళ్ళన్నీ

వాడే మింగుతుంటాడు. అందుకని అందరం కలిసి వాడికి 'సీమపంది' అని బిరుదిచ్చేం"

"అదలా ఉండనీ!" విసుక్కున్నాడు మూర్తి. "ఆ నల్లపంది ఈ పసుపు సమాజాన్ని లడ్డుండలా మింగేయాలని చూస్తోంది. ఈ సందర్భంలో ఆ నలుపుకూ ఈ ఎరుపుకూ జరిగే సంఘర్షణను ప్రదర్శించటమే ఈ చిత్రంలో సుబ్రావ్ చేసింది!"

రాజు, దాసు తృప్తిగా తలూపేరు.

"నువ్వన్నట్లు కళల్ని అర్థం చేసుకోవాలంటే కాస్త అనుభవం ఉండాల్సిందే!" అన్నాడు రాజు.

"సరేగానీ, ఇదంతా సుబ్రావ్‌గాడే చెప్పాడా? లేక నీకే తట్టిందా? " అనడిగేడు దాసు.

కళ్ళజోడు సవరించుకున్నాడు మూర్తి. "ఈ మాత్రానికి వాడిని అడగాలా? వాడి పెయింటింగ్‌కు పెట్టిన పేరు చూస్తే తెలీటంలా? "

"మాకు తట్టనేలేదు సుమా? 'సంఘర్షణ' అంటే ఇదన్నమాట. మొత్తంమీద నువ్వు మాత్రం ఈ పెయింటింగ్‌తో బాగానే సంఘర్షించావులే!"

అందరూ రాజీ కుదిరినట్లుగా, బరువు తగ్గినట్టుగా కదిలేరు.

రావుకు ఇందాకటి సజీవ కళాఖండాలెక్కడా కనిపించలేదు.

వాళ్ళు కళాస్వాదనతో కడుపు నింపుకుని ఎప్పుడో బయటకు పోయినట్లున్నారు ఆర్ట్‌గ్యాలరీలో జనం దాదాపు లేరు.

అటుగా వరండాలోకి చూసిన రావుకు అప్పుడే వస్తున్న సుబ్రావ్ కనుపించేడు.

"నూరేళ్ళాయుష్షు! రావోయ్!" కేకేశాడు మూర్తి!

ముసిముసి నవ్వుల్తో ఖరీదైన వాయినం ముట్టిన పెళ్లి కొడుకులా లోపలికొచ్చాడు సుబ్బారావు.

"నీ పెయింటింగ్‌ను వీళ్ళకు అర్థమయ్యేలా చెప్పలేక చచ్చాననుకో! మొత్తంమీద చాలా ఎదిగావోయ్!" అన్నాడు మూర్తి.

"కంగ్రాచ్యులేషన్స్" అన్నారందరూ ఏకగ్రీవంగా.

"థాంక్స్" అంటూ అందరికీ షేక్‌హ్యాండిచ్చేడు సుబ్బారావు. "ఆ ప్రైజు వచ్చిన పెయింటింగునే మ్యూజియం వాళ్ళు పదివేల రూపాయలకు కొనేశారు. ఇంతసేపూ వాళ్ళతోనే మాట్లాడుతున్నాను" అంటూ తృప్తిగా, గర్వంగా ఆ పెయింటింగు కేసి యధాలాపంగా చూసుకొని, ఉలిక్కిపడ్డాడు.

"పదండి కాఫీ త్రాగుదాం. ఎగ్జిబిషన్ మూసేసే టైమయింది" అంటూ బయటికి దారి తీశాడు.

"కాఫీ ఏమిటి? నాన్సెన్స్! ఇరవైవేలు కొట్టేసి కనీసం బీరు బుడ్డీ అన్నా ఇప్పించవురా!" ఎగిరేడు మూర్తి.

"ఓ! అలాగే!" అంటూ వాళ్ళతో కలిసి బయటికొచ్చి మళ్ళీ అంతలోనే ఏదో గుర్తొచ్చిన వాడిలా "ఇప్పుడేవస్తా"నంటూ ఆర్టు గ్యాలరీలోకి నడిచాడు సుబ్బారావు.

అక్కడే కునికిపాట్లు పడుతున్న ఎగ్జిబిషన్ ఇన్ఛార్జిని లాక్కుని తన పెయింటింగ్ వద్ద

కొచ్చాడు సుబ్బారావు.

"కనీసం అవార్డు వచ్చిన పెయింటింగులనన్నా సరిగా వ్రేలాడదీయవద్దటండీ! ఇంకానయం! ఎవరూ గుర్తించలేదుగానీ, మీ పరువూ, నా పరువూ గంగలో కలిసి ఉండును" అంటూ ఆ పెయింటింగును తలక్రిందులుచేసి, సరిగా సర్ది చేతులు దులుపు కుంటూ బయటికొచ్చాడు సుబ్బారావు.

ఎరుపు నలుపుల కళాత్మకత, కళాకారుల సింబాలిజంలను గురించి తీవ్రంగా చర్చించు కుంటున్న ఆ నలుగుర్నీ తోలుకుని తేలికైన హృదయంతో బరువుగా ముందుకు నడిచాడు సుబ్బారావు.

(1973)

☆